క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



బస్సు యాత్రలో భాగంగా గురువారం రాత్రి నెల్లూరుకు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంతో ఆమె సెల్ఫీ దిగారు.

–నెల్లూరు(దర్గామిట్ట)

రాజరాజేశ్వరీదేవికి బంగారు సరుడు బహూకరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరీదేవి దేవస్థానంలో కొలువైన రాజరాజేశ్వరీ దేవికి గంట రమణయ్యానాయుడు దంపతులు గురువారం బంగారు సరుడును బహూకరించారు. రూ.3.68 లక్షల విలువైన 52.600 మిల్లీగ్రాముల బంగారు సరుడును ఈఓ వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా అమ్మవారికి కానుకగా సమర్పించారు.

ప్రోస్తోడాంటిక్ సొసైటీ రాష్ట్రాధ్యక్షుడిగా విజయశంకర్



విజయశంకర్

నెల్లూరు(అర్బన్): ప్రోస్తోడాంటిక్ సొసైటీ రాష్ట్రాధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన డాక్టర్ విజయశంకర్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఇండియన్ ప్రోస్తోడాంటిక్ సొసైటీ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నగరానికి సమీపంలోని బృందావనం ఫామ్‌హౌస్‌లో గురువారం నిర్వహించారు. సొసైటీ రాష్ట్రాధ్యక్షుడు సురేష్ సజ్జన్, కార్యదర్శి డాక్టర్ పీ శేషారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై సమావేశాన్ని ప్రారంభించారు. తొలుత దంత వైద్యంలో వస్తున్న ఆధునిక వైద్యసేవలను వివరించారు. దంత వైద్యంలో అత్యుత్తమ సేవలందించిన వైద్యులను సత్కరించారు. అనంతరం సొసైటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సొసైటీ కార్యదర్శిగా భువన్ చంద్, కోశాధికారిగా సందీప్, సంపాదకులుగా సుధీర్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు విజయశంకర్‌యాదవ్‌ను పలువురు వైద్యులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రోస్తోడాంటిక్ విభాగంలోని దంత వైద్య విద్యార్థులకు, సహచర ప్రోస్తోడాంటిస్ట్‌లకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతామన్నారు. దంత వైద్యంలో మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు

ఇందుకూరుపేట : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. మండలంలోని మైపాడు, జగదేవిపేట ఆరోగ్య కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయాగ్రామాల్లోని పలువురు ఇళ్లను సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుతో పాటు వ్యాక్సినేషన్‌పై ఆరాతీశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలను వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యాధికారులు శ్రావణి, కిశోర్, బ్రహ్మానాయుడు, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

వీఎస్‌యూ ఆర్ట్స్ డీన్‌గా డాక్టర్ సునీత

వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆర్ట్స్ డీన్‌గా డాక్టర్ కే సునీతను నియమించినట్లు వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూ సోషల్ వర్క్ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ కే సునీతను వీఎస్‌యూ వైస్‌చాన్సలర్ జీఎం సుందరవల్లి అనుమతితో వీఎస్‌యూ ఆర్ట్స్ డీన్‌గా నియమించినట్లు తెలియజేశారు.

8న జాబ్ మేళా

విడవలూరు : స్థానిక పీఆర్‌ఆర్‌వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో ఈ నెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బీ సుజాత గురువారం తెలిపారు. హీరో, నియోలింక్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 10 గంటలకు రెజ్యూమ్, ఆధార్, పాస్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 77806 92460, 86395 34650 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



మాట్లాడుతున్న ఆర్వో వికాస్‌మర్మత్

• నెల్లూరు సిటీ రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి సంబంధించి కొన్ని అనుమతులను మాత్రమే పొందుపరుస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో ఉల్లంఘనలకు పాల్పడుతున్న విషయాలు తమ దృష్టికి వస్తున్నాయన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యాప్‌లో ఫిర్యాదు చేసే ముందు ఆయా ప్రచారాలకు అనుమతులు ఉన్నాయా..లేవా అని నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రచార కరపత్రాలపై సంఖ్య, ముద్రణ సంస్థ పేరు కనిపించేలా ముద్రించుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏమైనా సందేహాలు, సమస్యలు ఉంటే తమను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు యాడ్ ఏజెన్సీలు అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆర్వోను కోరారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన వివిధ సందేహాలను ఎఫ్ఎస్‌టీ, ఎక్స్‌పెండిచర్, సీ విజిల్, సీజర్, ఎంకోర్, వీఎస్‌టీ బృందాలు, ఏఆర్వోలు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నుంచి రాజీవ్‌రెడ్డి, రాజేష్‌కుమార్, టీడీపీ నుంచి ఉచ్చిభువనేశ్వరప్రసాద్, హరికృష్ణ, బీజేపీ నుంచి ధనేష్‌నాయుడు, నరేష్, సీపీఎం నుంచి శ్రీనివాసులు, నరసింహం, కాంగ్రెస్ నుంచి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ అభివృద్ధికి ఆదాలను ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి తన తండ్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆదాల హిమబిందు కోరారు. గురువారం ఆమె తన తండ్రి ఆదాలకు మద్దతుగా 21వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా తన తండ్రి ఆదాల బాధ్యతలు చేపట్టాక కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తన తండ్రిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా, అభివృద్ధి పరంగా మరింత ముందుకు తీసుకెళ్తారని వివరించారు. పార్టీ నాయకులు లక్ష్మీ సునంద, వేలూరు శ్రీధర్‌రెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, సురేష్, రామిరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని దీవించండి



ప్రచారం నిర్వహిస్తున్న సునందవిజయసాయిరెడ్డి, హసీనా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని దీవించాలని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సతీమణి సునంద విజయసాయిరెడ్డి కోరారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 43వ డివిజన్ జెండావీధిలో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ సతీమణి హసీనాతో కలిసి గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. నెల్లూరు అభివృద్ధికి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, మహిళలు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



రాజీనామా లేఖలను చూపిస్తున్న వలంటీర్లు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 20వ డివిజన్‌లో ఉన్న 20/1 సచివాలయం పరిధిలోని 14 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తమ ఉద్యోగాలకు గురువారం రాజీనామా చేశారు. టీడీపీ తమపై కక్ష గట్టి ఈసీకి ఫిర్యాదు చేయించి వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకుందని వలంటీర్లు మండిపడ్డారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసేందుకు వలంటీర్‌గా చేరామని, అటువంటి తమ విధులను అడ్డుకోవడంతో వలంటీర్‌గా కొనసాగలేక రాజీనామా చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు గుంజ ప్రతిష్ట



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి సంప్రదాయంగా గుంజ ప్రతిష్ఠను గురువారం నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఆలయ ఈఓ విరుపావరుపుల గిరికృష్ణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ నిబంధనలు పాటించాలి



డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ ఆవరణాన్ని పరిశీలిస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): ప్రజారోగ్యానికి సంబంధించి కార్పొరేషన్ సూచించిన నిబంధనలను వ్యాపార, వాణిజ్య అనుమతులు పొందిన అన్ని సంస్థలు విధిగా పాటించాలని ఎంహెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. మాగుంటలేఅవుట్‌లోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్, ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని ఎస్సార్‌కే స్కూల్, మినీ బైపాస్‌రోడ్డు, వనంతోపు సమీపంలోని మయూర్ డెకార్స్‌ను గురువారం ఆయన సందర్శించారు. ట్రేడ్ లైసెన్స్‌లు, ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు తనిఖీ చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించిన డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యాసంస్థకు నోటీసులు జారీ చేశారు. విద్యార్థులకు మెరుగైన పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలను కల్పించాలని స్కూల్ నిర్వాహకులకు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు కార్పొరేషన్ సూచించిన నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

రమణీయంగా గాత్రకచేరి



గాత్రకచేరి చేస్తున్న కశ్యప్ మహేష్

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా స్వామి వారు కల్యాణరాముడి అలంకారంలో గురువారం దర్శనమిచ్చారు. తిరుచ్చికి చెందిన సంగీత విద్వాంసుడు డాక్టర్ కశ్యప్ మహేష్ గాత్రకచేరి రమణీయంగా సాగింది. సుబ్రమణి, హరిప్రసాద్, రాజగణేష్ వాద్య సహకారం అందించారు. నంది వసంతకుమారి, పురాణం విజయలక్ష్మి భాగవతారిణులతో హరికథా గానాన్ని నిర్వహించారు. స్థానిక ఔత్సాహిక కళాకారులతో గాత్ర, వీణ కచేరీలు వీనులవిందుగా సాగాయి. భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ అధ్యక్ష, శాశ్వత కార్యదర్శులు చతుర్వేదుల శ్రీరామ్మూర్తి, యనమండ్ర నాగదేవీప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

నేత్రదానం



నారాయణ(ఫైల్)

నెల్లూరు(అర్బన్): బాలాజీనగర్‌లోని సరస్వతినగర్‌కు చెందిన కొంకా నారాయణ(80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ గురువారం సేకరించారు. అనంతరం కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదాన మోటివేటర్, చిరంజీవి బ్లడ్, ఐ బ్యాంకు ఇన్‌చార్జి సుధీర్ సకాలంలో సమాచారం అందించి నేత్రాల సేకరణకు సహకరించారు.

కవి సమ్మేళనానికి ఉపాధ్యాయుడికి ఆహ్వానం



నరేంద్ర

నెల్లూరు(అర్బన్): నగరంలోని గాంధీనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు, వర్ధమాన కవి మక్తాల నరేంద్రకు అరుదైన గౌరవం దక్కింది. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న చెన్నైలోని మెరీనా ప్రాంగణంలో శ్రీ క్రోధి నామ ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కవి సమ్మేళనానికి దేశ వ్యాప్తంగా 60 మందికి ఆహ్వానాలు అందగా, అందులో ఉపాధ్యాయుడు నరేంద్ర ఉన్నారు. కాగా ఆయన కొడవలూరు మండలం నార్తురాజుపాళెం హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీగా సుధీర్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా న్యాయవాది వీ సుధీర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ డాక్టర్ జంధ్యాల శాస్త్రి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థులకు అన్ని విధాలా న్యాయ సాయం అందిస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి సీనియర్లు గుడ్‌బై



అల్లాఉద్దీన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం అవలంభిస్తున్న ఏకపక్ష చర్యలకు నిరసనగా సీనియర్ నాయకులు ఆ పార్టీని వీడుతున్నారు. 30 ఏళ్లుగా పార్టీకు సేవలందించిన జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్ బాటలోనే తాజాగా జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎస్కే అల్లావుద్దీన్ పార్టీకు గుడ్‌బై చెప్పారు. అల్లావుద్దీన్ గత 16 ఏళ్లుగా మైనార్టీ విభాగంలో అనేక పదవుల్లో కొనసాగారు. మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నెల్లూరు రూరల్ నుంచి పార్టీ తరుపున టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తు చేసుకున్న తనను కాదని మరొక వ్యక్తికి రూరల్ సీటు కేటాయించడంతో మనస్తాపానికి గురై పార్టీకు గుడ్‌బై చెప్పినట్లు ఆయన తెలిపారు. నెల్లూరులో డీసీసీ అధ్యక్షుడు, మరో వ్యక్తికి తప్ప మిగిలిన సీనియర్లకు గుర్తింపు లేకుండా పోయిందని త్వరలో తన అభిమానులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానన్నారు.

న్యాయమూర్తుల బదిలీ

నెల్లూరు (లీగల్): రాష్ట్ర వ్యాప్తంగా పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను గురువారం జారీ చేసింది. ఇక్కడి రెండో అదనపు జిల్లా (ఏసీబీ ప్రత్యేక) కోర్టు న్యాయమూర్తి సత్యవాణిని అనంతపురం జిల్లా మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా.. వైఎస్సార్ జిల్లా మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గీతను నెల్లూరు మహిళా నేరాల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా నియమించారు.

• నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీనారాయణను కృష్ణా జిల్లా గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. చిత్తూరు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్‌ను ఆయన స్థానంలో నియమించారు.

నిషేధిత ప్లాస్టిక్ కట్టడికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

• ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయ, విక్రయాలను పర్యవేక్షించేందుకు వ్యాపారులతో కూడిన నూతన మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ప్లాస్టిక్ ఆధారిత ఉత్పత్తుల స్టాకిస్టులు, హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ వ్యాపారులతో ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై అవగాహన సమావేశాన్ని స్టోన్‌హౌస్‌పేటలోని తోటబడి సమీపంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయ వ్యాపారుల్లో నలుగురిని సభ్యులుగా ఎంపిక చేసి నూతనంగా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ క్రమం తప్పకుండా 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం కలిగిన సింగిల్ యూజ్ నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల రవాణా, గోదాముల్లో నిల్వలు, క్రయవిక్రయాలను తనిఖీ చేస్తుందన్నారు. నగరంలో ఎక్కడైనా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల మీద ఫిర్యాదులు అందితే దానికి బాధ్యత వహిస్తూ మానిటరింగ్ కమిటీ తగిన చర్యలు తీసుకునేలా మార్గదర్శకాలు జారీ చేస్తామని వివరించారు. మరో పదిహేను రోజుల్లోగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వచ్ఛందంగా నిర్మూలించుకోవాలన్నారు. అనంతరం దాడులు నిర్వహించి భారీ జరిమానాలు, చట్టపరమైన క్రిమినల్ చర్యలతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వస్త్ర, జౌళి, నార ఉత్పత్తుల సంచుల వాడకాన్ని ఒక అలవాటుగా చేసుకుని పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

ఇఫ్తార్ విందు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఆదాల

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 29వ డివిజన్, గాంధీనగర్ పెద్దమసీదులో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ సత్తార్, షేక్ జాకీర్, రియాజ్, షంషీద్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

మంగళపూరి నోరు అదుపులో ఉంచుకో



మాట్లాడుతున్న మన ఎమ్మార్పీఎస్ రాష్ట్రాధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని పక్కదారి పట్టిస్తున్న మందకృష్ణమాదిగ వైఫల్యాలను నిలదీసిన మాదిగ జేఏసీ నాయకుల నాలుకలను చీరేస్తామని మాట్లాడిన మంగళపూరి సురేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మన ఎమ్మార్పీఎస్ రాష్ట్రాధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు హెచ్చరించారు. నగరంలోని కొండాయపాళెంలోని డాక్టర్ అంబేడ్కర్ భవన్ వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటగిరిలో కూర్చుని సురేష్‌బాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. దమ్ముధైర్యం ఉంటే నెల్లూరుకు వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. మాదిగలు తెల్లచొక్కాలు వేసుకోవాలని చెప్పింది మందకృష్ణమాదిగ కాదని, అంబేడ్కర్ అని అన్నారు. మాదిగలను బీజేపీకి తాకట్టు పెట్టిన వ్యక్తి మందకృష్ణమాదిగ అని, ఆయన మాదిగల్లో విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కోలగట్ల రమేష్, ఎమ్మార్పీఎస్(బ్రహ్మయ్య వర్గం) జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ గోపి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కాకుమూరి శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు పల్లాల సునీత, కుమార్, పృథ్వీ ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం, వివేక్, సుధాకర్, తదితరులు, పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటును వినియోగించుకోండి



కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలోని వీఆర్సీ సెంటర్, పెద్దబజారు, కోటమిట్ట, మహాలక్ష్మమ్మ గుడి, వాకర్స్ రోడ్డు, మద్రాసు బస్టాండ్, సీఏఎం హైస్కూల్, అలంకార్ సెంటర్, రామయ్యబడి, బట్వాడిపాళెం, తదితర ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర బలగాలతో భరోసా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

శీతల పానీయాలు ఆరోగ్యానికి హానికరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనునాయక్

నెల్లూరు(అర్బన్): శీతల పానీయాలు ఆరోగ్యానికి హానికరమని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్ సూచించారు. నగరంలోని శెట్టిగుంటరోడ్డులోని వైవీఎం మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి జాగ్రత్తలు, శీతల పానీయాలతో కలిగే దుష్ఫలితాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనునాయక్ మాట్లాడుతూ శీతల పానీయాల్లో ఎలాంటి పోషకాలు ఉండవన్నారు. వేసవిలో వాటిని తాగితే మరింత దాహాన్ని పెంచుతాయన్నారు. గ్యాస్ట్రిక్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వాటికి బదులుగా పలుచటి మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా నాయకుడు మాదాల రాము, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.